అర్ధరాత్రి

టెంపోరావ్

ఉషాదేవి మేడ మెట్లు ఎక్కి నడవమ్మట నడవసాగింది.

హోటల్ గదుల నంబర్లను ఆమె కళ్ళు పరకాయించి చూస్తున్నాయి. ఐదు, ఆరు.... అంటే ఇంకా ముందుకు పోవాలన్న మాట!

ఆజానుబాహుడైన వ్యక్తి యెవరో గదిలోంచి బయటకొచ్చి, తలుపుమూసి తాళాలు వేస్తున్నాడు. పని ముగించి అతడు అదే నడవమ్మట ఆమెకెదురుగా నడవసాగాడు. ఆమె కళ్ళు నంబర్లను చూడ్డంమాని ఎదురుగా వస్తూ అతడివైపు వెళ్ళాయి.

ఏడడుగుల పొడుగాటి మనిషి....బుగ్గమీసాలు.... పళ్ళమధ్య పొడుగాటి చుట్ట .... పెద్ద పెద్ద అంగల్లో నడక ....

అతను దగ్గరకు రాగానే "క్షమించండి!" అని ఆమె అతడివంక చూసింది.

చుట్ట పొగ వదుల్తూ, విచిత్రంగా నవ్వుతూ తన

ముందు నిలబడిన ఆమెను అతడు ఎగా, దిగా పరికించాడు.

"క్షమించాను, అమ్మాయ్!" అన్నాడతను క్లుప్తంగా.

"మీకోసమే వస్తున్నాను. మీతో అర్జెంటుగా మాట్లాడాలి."

"నాకోసమా? పొరబడటంలేదుగా?"

జవాబివ్వకుండా ఆమె నవ్వింది. ఆమె తెల్లని పళ్ళు ముత్యాల్లా మెరిశాయి.

"మిమ్మల్ని చూడగానే మీరే వాలిగారని అందరూ పోలుస్తారు!" అందామె.

డిటెక్టివ్ వాలి గంభీరంగా నవ్వాడు. తన బుగ్గ మీసాలను ఓసారి సగర్వంగా వేలితో దిద్దుకున్నాడు. నోట్లోని చుట్టను చేత్తో పట్టుకొని అలాగా అంటూ, వెనక్కి తిరిగి వెళ్ళాడు. ఆమె అతన్ని అనుసరించింది.

వాలి తన కాళ్ళను ముందున్న బల్లమీద చాచి, పడక్కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నాడు. ఉషాదేవి అతని ప్రక్కనున్న సోఫాలో కూర్చుని, కథ ఎలా ప్రారంభించడమా అని ఆలోచిస్తోంది.

"అమ్మాయ్, నీ పేరు ఉషాదేవి. నువ్వు చాలా హడావిడిగా ఎవరో పంపడంవల్ల ఇక్కడికి వచ్చావ్.."

ఆమె విస్మయంతో అతన్ని చూసింది.

"అవన్నీ మీకెలా తెలుసు?"

వాలి నవ్వుతూ జవాబిచ్చాడు. "అది కూడా చెప్పాలా? వాలికి అన్నీ తెలుస్తూనే వుంటాయి. నీ చేతిలోని హాండ్ బాగ్ మీద నీ పేరుందిగా? తర్వాత నువ్వు జుట్టు దువ్వుకోలేదు. బొట్టు పెట్టుకోలేదు. బహుశా స్నానం కూడా చేసివుండవు. జాకెట్టు రంగు నీ చీరరంగుకి చాలా విరుద్ధంగా వుంది. కాని నీ గాజులనీ,

హాండ్ బాగ్ నీ చూస్తే నువ్వు మామూలుగా మంచి అభిరుచితో ముస్తాబయ్యే స్త్రీవని తెలుస్తుంది. వీటినిబట్టి హాడావిడిగా వచ్చావని బోధపడుతుంది."

"అదంతా బాగానే వుంది. నన్నెవరో పంపి వుంటారని ఎలా అన్నారు?"

నవ్వుతూ వాలి పడక్కుర్చీలో లేచికూర్చుని, చెయ్యి చాచి ఆమె కుడిబుగ్గను మెల్లిగా గిల్లాడు.

"వెర్రిపిల్లా! మనస్సు ప్రతిబింబాన్ని మొహంలో చూడొచ్చుగా! నీ మొహంచూస్తే నా దగ్గరకి ఇష్టం లేకపోయినా వచ్చినట్టు స్పష్టంగా తెలుస్తోంది. అందువల్ల యెవరో నిన్ను పంపించి వుంటారని అన్నాను" వాలి మళ్ళా కుర్చీలో వెనక్కి బోర్లా బడ్డాడు. చుట్ట పొగ వదుల్తూ, కళ్ళు మూశాడు. ఆమె ఇలా చెప్పసాగింది:

"ఆవును. మా యజమానురాలైన దుర్గమ్మగారు నన్ను మీ వద్దకు పంపించారు. నిన్న రాత్రి 12 ప్రాంతంలో దుర్గమ్మగారి భర్త దక్షిణామూర్తిగారిని యెవరో హత్య చేశారు. ఆ విషయం ఈ వేళ పేపర్లో మీరు చూసే వుంటారు...." ఆమె ఆగింది. కళ్ళు మూసుకొని విశ్రాంతిగా చుట్ట కాలుస్తూన్న వాలి జవాబివ్వలేదు.

"నే చెప్పేది వింటున్నారా?" అందామె.

"నా చెవులు జాగ్రత్తగా వింటున్నాయి" అన్నాడు వాలి.

"దక్షిణామూర్తిగారిని యెవరు హత్య చేసిందీ అప్పుడే తేలిపోయింది. ఆయన మేనల్లుడైన శంకరమే హత్య చేసుంటాడని ఇంట్లో వున్న వాళ్ళందరికీ తెలుసు. ఈ రోజు పొద్దుటే పోలీసులు శంకరాన్ని అరస్టుచేసి తీసుకు పోయారు. అయినప్పటికీ శంకరం హంతకుడని దుర్గమ్మ

గారు నమ్మటంలేదు. అందువలన యెవరు హత్య చేసిందీ మీరు కనుక్కోవాలని ఆమె కోరిక. అది మీతో చెప్పడం కోసం నేను వచ్చాను."

కళ్ళు తెరిచి వాలి ఆమెవైపు చూశాడు.

"అమ్మాయి, నువ్వేమంటావు? మేనల్లుడు శంకరం హత్య చేశాడంటావా?" అడిగాడతను.

"అనేకమంది చెప్పినదాన్నిబట్టి శంకరమే హంతకుడని అనిపిస్తోంది. నేనూ అలాగే భావిస్తున్నాను. అందుకే అతడిని వెంటనే పోలీసులు అరస్టు చేశారు. తను పట్టుకున్న కుందేలుకి మూడే కాళ్ళు వున్నట్లు దుర్గమ్మగారు శంకరం నిర్దోషని భీష్మించి కూర్చున్నారు."

"అయితే నేను రావడం ఏ విధంగా లాభిస్తుంది?"

"బాగా అడిగారు. నేనూ అదే అనుకుంటున్నాను. నల్లగా వున్న గోడను మీరు మాత్రం తెల్లగా వుందని అనగలరా? దుర్గమ్మగారు తిక్కమనిషి. తప్పకుండా మీరు రావాలని అన్నారామె."

"అయితే వెళ్దాంపద!" అన్నాడు వాలి.

2

కారులోంచి దిగగానే డిటెక్టివ్ వాలి ఓసారి ఆ భవనాన్ని కలయజూశాడు. విశాలమైన మూడంతస్తుల భవనం. పెద్ద తోట. ఆరడుగుల ఎత్తున ప్రహారీ గోడ నలువైపులా వుంది.

వాలిని ఆమె మొదటి అంతస్థులో వున్న దుర్గమ్మ గదిలోకి తీసుకు వెళ్ళింది.

వాలిని చూడగానే నలభై ఐదేళ్ళ వయస్సులో వున్న దుర్గమ్మ నవ్వుతూ ఆహ్వానించింది. ఘనేగా సెంటువాసన గదిలో గుప్పున కొడుతోంది. వాలి సోఫాలో కూర్చు

న్నాడు. ఉషాదేవి బయటకు వెళ్ళిపోయింది.

విచారవదనంతో దుర్గమ్మ వాలి పక్కనే కూర్చుని అతడి చేతులను పట్టుకుంది.

"వాలి గారూ, శంకరం నిర్దోషి. అది నాకు తెలుసు" అందామె.

వాలి ఆమెవైపు సూటిగా చూశాడు.

"నీకెలా తెలుసు?"

"స్త్రీలకు అంతర్గతంగా నిజం తెలుస్తూ వుంటుంది. శంకరం నిర్దోషని నా హృదయం చెప్తోంది, బొబ్బలెడ్తోంది!" అందామె.

వాలి విచిత్రంగా నవ్వాడు. ఆమె మొహం చిన్నబోయింది.

"అంతగా నవ్వారేమిటి?"

"రేపు కోర్టులో జూరీ సభ్యులు నీ హృదయం పలికే మాటలు విని యెలా నవ్వుతారో నీకు చూపించడానికి అంతగా నవ్వాను. నీ హృదయం శంకరం నిర్దోషం టే కోర్టు సమ్మతించదు. అందుకు అవుసరసమైన ఋజావు లుండాలి."

"నాకు నిజం తేలుసు. ఎవరు చంపారో తెలుసు."

"ఎవరు?" అడిగాడతను ఆశ్చర్యంతో.

"మకరమూర్తి."

"అతనెవరు?

"అతడు మావారి ప్రాణమిత్రుడైన రామ్మూర్తిగారి కొడుకు. రామ్మూర్తిగారు చాలా డబ్బు గడించారు. ఆయన మరణించేసరికి మకరమూర్తి పన్నెండేళ్ళ కుర్రాడు. మరెవరూ లేకపోవడంవలన చనిపోతూ ఆయన

తన ఆస్తిని మా వారికిచ్చారు. ఆ ఆస్తిని జాగ్రత్తగా చూడమనీ, 25 ఏళ్ళు వచ్చాక మకరమూర్తికి ఇవ్వమనీ చెప్పారు. అంతవరకూ మకరమూర్తిని యీ ఇంట్లోనే ఉంచుకోమన్నారు. ఇదంతా రామ్మూర్తిగారు స్పష్టంగా రాసి మరణించారు.”

“మకరమూర్తి యిక్కడే వుంటున్నాడా?”

“10 ఏళ్ళనుంచి మాతోనే ఉంటున్నాడు. కాని అతడికి చదువు అబ్బలేదు. మా వారికి కార్యదర్శిగా వుండి ఆయన పనులను చూస్తూ వుంటాడు.”

“అతడు హత్య చేయడం నువ్వు స్వయంగా చూశావా?” ప్రశ్నించాడు వాలి.

“చూడలేదు. కాని అతడే హంతకుడని నా హృదయానికి తెలుసు.”

వాలి మళ్ళా విచిత్రంగా నవ్వాడు.

“నిన్న రాత్రి హత్య గురించి నీకు తెలిసినదంతా వివరంగా చెప్పు!”

“క్రింద భాగంలో వున్న డైనింగ్ హాల్లో 9-30కి అందరం భోజనాలకు కూర్చున్నాం.”

“ఎవరెవరున్నారు?”

“నేను, మావారు, మకరమూర్తి, ఉష, నిబ్బరాజు.”

“నిబ్బరాజు ఎవరు?”

“అతడు నా మరది. మావారూ, అతడూ కలిసి వ్యాపారం చేస్తున్నారు. అతడు హైద్రాబాద్‌లో వున్న మా కంపెనీ బ్రాంచిని నడుపుతున్నాడు. ఈ వూరువచ్చి మూడు నెలలయింది. అప్పటినుంచీ మాతోనే ఇక్కడ వుంటున్నాడు” అందామె.

“ఉష నీకు ఏమవుతుంది?”

"ఒక అనాధాశ్రమంలో నేను ఉషను చూశాను. రచ్చి మా ఇంట్లో వుండమన్నాను. ఆమె ఇక్కడికొచ్చి ఆరు నెలలయింది. ఉషంటే నాకెంతో ఇష్టం. ఎప్పుడూ నవ్వుతూ, ఆనందంతో తిరిగే యువతులను చూస్తూంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ఉషను చూసి మావారు విసుక్కునేవారు. కాని నాకోసం వూరు కున్నారు."

"నీ భర్త మగెవర్ని చూసి విసుక్కునేవాడు?"

వెంటనే ఆమె జవాబివ్వలేదు. క్షణాలో ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

"ఆయనది వెన్నలాటి హృదయం, సార్. కాని ఆయనకు చిరాకు ఎక్కువ. ఆయన ముక్కోపి. పొద్దుట నుంచి రాత్రిదాకా ఆయన అందర్నీ ఎడాపెడా తిడ్తూనే ఉండేవారు...."

"నిన్ను కూడానా?" ఆడుగుతూ అడిగాడు వాలి.

"నన్నూ తిట్టేవారు. నేనూ తిట్టేదాన్ని. యెదటి వాళ్ళు నోరు మూసుకుంటే ఆయన ఇంకా ఎక్కువగా తిడ్తారని నాకు తెలుసు. అది ఆయన స్వభావం. ఆయన నన్ను ఏదేనా అంటే గాయపడిన పులిలా లేచి అరిచే దాన్ని. దానితో ఆయన వూరుకునేవారు" అందామె. చుట్ట పొగ పీల్చి వదులుతూ వాలి క్షణకాలం మౌనంగా ఉండిపోయాడు.

"నిన్న రాత్రి ఏం జరిగిందో చెప్పు!"

"భోజనాలు సాగుతూండగా ఏదో పని సరిగ్గా చేయ లేదని మావారు మకరమూర్తిని విపరీతంగా తిట్టారు. సాధారణంగా యెవరు ఎంత తిట్టినా అతడు లెక్కచేసే వాడుకాదు. రాయిలా ఉండేవాడు. యెందుకలనో నిన్న

నా భర్త తిడుతూండగా తన ఉద్రేకాన్ని ఆపుకోలేక టేబులుమీదున్న పళ్ళుకోసే కత్తిని గట్టిగా పట్టుకొని లోలోపల అల్లల్లాడాడు. ఆ సమయంలో అతడి మొహం వికృతరూపం దాల్చింది. కత్తిని పట్టుకున్న అతడి చెయ్యి కోపంతో వణికింది. కాని అప్పట్లో అతడి ప్రవర్తన ఈ హత్యకు దారితీస్తుందని నేను ఊహించలేకపోయాను. అతనే హంతకుడు!"

ఆమె బరువుగా ఊపిరి పీలుస్తూ ఆగింది. కొంత సేపయ్యాక వాలివైపు చూసింది.

"భోజనం అయాక మావారు మొదటి అంతస్తులో వున్న ఆఫీసుగదిలోకి వెళ్లారు. 10 గంటలకు నిబ్బరాజా ఆ గదిలోకి వెళ్ళాడు. వాళ్ళిద్దరూ 10-30 వరకూ కంపెనీ విషయాలు మాట్లాడుకున్నారు. తర్వాత మకరమూర్తిని మావారు పిల్చారు. అతను వెళ్ళాడు. నాకు నిద్రపట్టక పడకొండున్నరకి నేనూ ఆయన గదిలోకి వెళ్ళాను. మావారు టేబుల్ వెనుకనున్న కుర్చీలో కూర్చుని వున్నారు. నేను గదిలోకి వెళ్ళగానే పోయి పడుకుంటానని మకరమూర్తి వెళ్ళిపోయాడు. పన్నెండు కొట్టగానే నేను నా గదికి వెళ్ళిపోయాను."

"ఆ తర్వాత ఏమైంది?"

"నేను బయటకు వచ్చిన కాసేపట్లో శంకరం ఏదో పార్టీకి వెళ్ళి తప్ప తాగి వచ్చాడు. రెండో అంతస్తులో వున్న తన గదికి వెళ్ళబోతూ ఓసారి మావారి గదిలోకి వెళ్ళాడట."

వాలి సోఫాలోంచి లేచాడు.

"హత్య జరిగిన గదిని చూపిస్తావా?"

ఇద్దరూ గది బయటకు వచ్చి నడవమూలనున్న

దక్షిణామూర్తి గదిలోకి ప్రవేశించారు.

చాలా విశాలమైన గది. ఒకవైపున పెద్ద టేబుల్ వుంది. దాని వెనుక కుషన్డ్ రొటేటింగ్ చెయిర్! కిటికీలకు అందమైన సిల్కు కర్టెను అమర్చబడ్డాయి.

వాలి గుమ్మంలో నిలబడి తిన్నగా ముందుకుచూశాడు. సిల్కు కర్టెన్ కవతల వంకెలు తిరిగిన మేడమెట్లు అగు పడ్డాయి. వాలి పక్కనున్న ఆమెవైపు తిరిగాడు.

"ఆ మెట్లు మూడో అంతస్థులో వున్న మావారి పడగదికి వెళ్తాయి. ఆ గదిలో కూర్చుని ఆయన ఆఫీసు పనులన్నీ రాత్రి ఒంటిగంటదాకా చూస్తూ వుంటారు. అటుపైన ఆ మెట్లెక్కి పైనున్న పడగ్గదికి వెళ్ళి నిద్ర పోతారు."

"మూడో అంతస్థులో ఆ గదికి తోడుగా యింకా గదులున్నాయా?"

"ఆయన పడగది మాత్రమే వుంది. అక్కడికెళ్ళా లంటే ఆ మెట్లే ఎక్కాలి" అందామె.

మాట్లాడకుండా వాలి రొటేటింగ్ కుర్చీ దగ్గరకు నడిచాడు. టేబులుమీద అమర్చిన రెక్సైన్ క్లాత్ మీద రక్తం మరకలున్నాయి.

కిందకు వంగి వాలి నేలను కప్పిన తివాసీని పరీ క్షించాడు. తివాసీమీద కూడా రక్తం మరకలు కన బడ్డాయి. అతడు ఆమెవైపు చూశాడు."

"అతడి శవం ఎలా, ఎక్కడ పడివుంది?"

"తివాసీమీద, కుర్చీకి సమీపంలో పడి వుంది" అందామె.

టేబులు కుడివైపున స్టేండ్ మీద ఎత్తుగా ఒక లాంప్ వుంది. గదిలో రెండు ఫ్లోరోసెంట్ లైట్లు ఉన్నాయి.

"దక్షిణామూర్తి ఈ గదిలో పని చేసేటప్పుడు అన్ని లైట్లనూ వాడతాడా?"

"ఈ టేబులు లాంప్ మాత్రం ఆన్ చేయబడి వుంటుంది. తతిమ్మా లైట్లను ఆయన ఉపయోగించరు."

వాలి తీవ్రంగా ఆలోచించసాగాడు.

"శవాన్ని పోలీస్ వాళ్ళు పట్టుకెళ్ళి ఎంత సేపయ్యింది?"

"7 గంటలకి పట్టుకెళ్ళారు. అప్పుడే శంకరాన్ని కూడా తీసుకెళ్ళారు."

వాలి గదంతటినీ పరీక్షించి, బయటకు నడిచాడు. దుర్గమ్మ అతన్ని అనుసరించింది.

"క్రింది భాగంలో మీకొక గది ప్రత్యేకంగా ఉంచమన్నాను. ఈ హత్యా రహస్యం తెలిసిందాకా మీరు ఇక్కడే ఉండాలని నా కోరిక" అంది దుర్గమ్మ.

"నిజం తెలియకపోదు. తెలుసుకున్నదాకా ఇక్కడే ఉంటాను" అంటూ డిటెక్టివ్ వాలి మేడ మెట్లు దిగాడు.

డిటెక్టివ్ వాలి కిందనున్న హాలులో అడుగు పెట్టగానే యెవరో వ్యక్తి తొందరగా ఆ గదిలోకి ప్రవేశించి, చేతిలోని తోలు సంచీని సోఫామీద పడేశాడు.

"ఏయ్, రంగా!" అని గట్టిగా అరిచాడతను.

మరో క్షణంలో వంటవాడు రంగన్న చేతులు జోడించుకుని అతనివద్దకు వచ్చాడు.

"ఇడియట్, ఈ గది శుభ్రంగా ఉంచమని ఎన్నిసార్లు చెప్పాను? బొత్తిగా బుద్ధి లేకుండా మసులుతున్నావు!" అన్నాడతను విశేషమైన కోపంతో.

ఆ మాటలను వింటూ, వాలి అతనివైపు నడిచాడు. అతను నిబ్బరాజే అయుంటాడని కోపంతో కూడిన

మాటలను పట్టి గ్రహించాడు. అతను వాలివైపు శత్రు భావంతో చూశాడు.

"మీరెవరు? ఏం కావాలి?" అని కసిరాడు.

"డిటెక్టివ్ వాలిని. దక్షిణామూర్తి హంతకుడు కావాలి!"

"అయితే మా వదిన పిచ్చిగా మిమ్మల్ని రప్పించిందన్నమాట. నన్నడిగితే ఇదంతా డబ్బు తగలెట్టడం అంటాను. శంకరం హంతకుడని అందరికీ తెలిసిందే. మీరు మాత్రం వచ్చి ఏం పొడిచేస్తారు?"

"బాగా చెప్పావు. మీ వదినకు నిజంగా చాదస్తమే అనొచ్చు. అందరికీ తెలిసిన విషయాన్ని నేను మాత్రం కాదనగలనా?" వాలి నవ్వుతూ జవాబిచ్చాడు.

వాలి జవాబుతో నిబ్బరాజు కోపం తగ్గింది.

"అయితే శంకరం యెందుకు హత్య చేశాడంటావు?"

"యెందుకైనా అయ్యుండొచ్చు. వాడికి కావల్సిన డబ్బు అన్నయ్య ఇచ్చేవాడుకాదు."

"నిన్న రాత్రి అన్నయ్యతో నువ్వు మాట్లాడావని విన్నాను. ఎంతసేపు మాట్లాడావు?"

"అరగంట సేపు."

"ఏం మాట్లాడావు?"

"మా సంభాషణ మీ పరిశోధనకి ఉపకరించదు."

"అది నిర్ణయించాల్సింది నేను."

నిబ్బరాజు కాస్సేపు ఆలోచించి ఇలా చెప్పాడు.

"నిన్న రాత్రి అన్నయ్య నేనూ పోట్లాడుకున్నాం. అన్నయ్యకి కోపం ఎక్కువ. లోకువగా దొరికిన వారిని కొమ్ములు పెట్టి పొడిచి పారేసేవాడు. కాని అతని పప్పు నా దగ్గర ఉడికేదికాదు. అతనికంటె ఎక్కువ కోపంతో

మొహం వాచేటట్టు తిట్టివచ్చేశాను."

"ఇంతకీ ఏ విషయంమీద పోట్లాడుకున్నారు?"

"అది అడక్కండి. అది రహస్యం."

డిటెక్టివ్ వాలి నిబ్బరాజు కళ్ళల్లోకి సూటిగా చూశాడు.

"రహస్యాలను దాచడంలో నన్ను మించినవారు లోకంలో లేరని అందరూ అంటూ వుంటారు!"

నిబ్బరాజు కొంతసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నిన్న పొద్దుటనుంచీ ఉష మంచిదికాదనీ, ఆమెని వెంటనే పంపించివెయ్యమనీ అన్నయ్య పట్టుపట్టి కూర్చున్నాడు. ఆ విషయంమీదే మా ఇద్దరికీ పోట్లాట జరిగింది. ఉషను పంపించివేయాల్సిన అవుసరం ఏదీ రాలేదని నేను అతనితో వాదించాను. అతనితో వాదించడం మూర్ఖత్వమని గ్రహించి, చివరకి కోపంగా వచ్చేశాను. ఉషను బయటకు పొమ్మనడం మా వదినకి ఇష్టంలేదు. వదినా అన్నయ్యా నిన్న రాత్రి అదే విషయం మీద చర్చించుకున్నారట."

డిటెక్టివ్ వాలి హాలులో చిన్న బల్లమీదున్న టెలిఫోన్ దగ్గరకు నడిచాడు. తన మిత్రుడైన ఇన్స్పెక్టర్ రాజయ్యకు ఫోన్ చేసి, కొన్ని విషయాలు కనుక్కున్నాడు. డాక్టర్ రిపోర్టునిబట్టి హత్య 12—12.10 మధ్య జరిగివుండాలని నిర్ణయించబడింది. హత్యకు ఉపయోగించిన ఆయుధం లావుగా పొడుగ్గా వున్న ఒక కర్ర. వాలి తను తెలుసుకున్న విషయాలను నెమరేస్తూ, హాలులోంచి సమీపంలో ఉన్న ఉషాదేవి గదివైపు వెళ్ళాడు.

గది తెరిచివుంది. గుమ్మంలో నిల్చుని వాలి గదిలోకి

తొంగిచూసింది. లోపల బట్టలను స్టాండు మీద సర్దుతూన్న ఒక పనిమనిషి వాలిని చూసి, ముందుకు వచ్చింది.

"అమ్మాయ్ లేదా?"

"బయటకు వెళ్ళారండి" అంది పనిమనిషి.

నవ్వుతూ వాలి ఓసారి స్టాండుమీదున్న చీరలనూ, జాకెట్లనూ గమనించాడు.

"బట్టలను కొనడంలో ఉషాదేవి అభిరుచిని మెచ్చుకోవాలి" అన్నాడతను.

పనిమనిషి మాట్లాడలేదు.

"నిన్న రాత్రి భోజనాల సమయంలో అమ్మాయి ఏ చీర ధరించింది?"

ఒక ఆకుపచ్చ షిఫాన్ చీరను స్టేండునుంచి తీసి పనిమనిషి వాలి దగ్గరకు తెచ్చింది.

ఆ షిఫాన్ చీరను రెండు చేతుల్లోనూ పట్టుకొని వాలి ఆశ్చర్యంతో పరీక్షించాడు.

"అఖండంగా వుంది! అసామాన్యంగా వుంది!" అని ఆ చీరను మళ్ళా ఆమెకు ఇచ్చేశాడు.

పనిమనిషి దాన్ని అందుకొని బట్టల స్టాండు వైపు వెళ్ళింది. వాలి నవ్వుతూ తన చేతిలో ఉన్న కత్తెరను, ఆ చీరనుంచి తెగిన ముక్కనూ జేబులో వేసుకున్నాడు.

3

ఆ రోజు మధ్యాహ్నం వాలి నిద్రనుంచి లేచి, గదిలో పచార్లు చేస్తూ ఆలోచించసాగాడు. రంగన్న టీ పట్టుకుని గదిలోకి ప్రవేశించాడు.

"రంగన్నా!"

"ఏమండయ్యా?"

"నిన్న రాత్రి హత్య గురించి నీకేం తెలుసు?"

"అంతా పోలీసోళ్ళకి చెప్పానయ్యా!"

"నేను పోలీసువాడ్ని కాదు" అన్నాడు వాలి నవ్వుతూ.

"రాత్రి పదకొండున్నర దాటాక నేను కిందున్న నా గదిలో నిద్రపోయానయ్యా. నా గది అయ్యగారి గదికి సరిగ్గా కిందవుంది. హాలులోని గోడగడియారం 12 కొడుతూండగా వీధి తలుపు చప్పుడయింది. నాకు మెలుకువ వచ్చింది. శంకరంగారు అప్పుడే వచ్చుంటారని అనుకున్నాను. కాస్సేపట్లో మేడమీద అయ్యగారి గదిలో శంకరంగారి మాటల ధ్వని వినపడింది. రాత్రి నిశ్శబ్దంగా ఉండటంవల్ల మేడమీది అయ్యగారి గదిలో ఎవరేనా మాట్లాడితే ధ్వని వినపడ్తూనే వుంటుంది. కాని మాటలు వినపడలేదు. ఆయన వెళ్ళిపోయి పడుకుని ఉంటారని అనుకున్నాను."

"పై గదిలో మాట్లాడిన శంకరం కంఠాన్ని నువ్వు బాగా గుర్తుపట్టావా?"

"అది ఆయన కంఠమేనండి."

"పై గదిలో దుర్గమ్మ మాట్లాడ్డం, నిబ్బరాజు మాట్లాడ్డం వినపడిందా?"

"వినపడిందయ్యా. సాధారణంగా వాళ్ళిద్దరూ చాలా గట్టిగా మాట్లాడుతారు."

డిటెక్టివ్ వాలి ఆలోచిస్తూ మళ్ళా పచార్లు చేయసాగాడు. వంటమనిషి రంగన్న వెళ్ళిపోయాడు. చటుక్కున ఏదో ఆలోచన తట్టినట్టు వాలి గదిలోని బట్టలస్టాండువైపు వెళ్ళాడు. తన కోటుజేబులోని ఎర్ర సిరా పెన్నును బైటకు లాగి, దానిలోని సిరాను తను

క తిరించిన షిఫాను చీరముక్కపై విదిపాడు. ఎర్రటి మరకలుపడ్డ ఆ చీరముక్కను మళ్ళా కోటుజేబులో వేసుకొని, అతను నవ్వుకుంటూ కోటు తొడుక్కున్నాడు. చుట్టను వెలిగించి, వేగంగా గదిలోంచి బయటకు కదిలాడు.

వాలి ఉషాదేవి గదిలో ప్రవేశించాడు. మెల్లిగా తలుపులకు లోపల గడియవేశాడు. ఉషాదేవి నిలువుటద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటోంది.

"అమ్మాయ్!"

అతని పిలుపు వినగానే ఆమె చటుక్కున వెనక్కి తిరిగింది.

"మీరా!"

"నిన్న రాత్రి నువ్వు హత్య జరిగిన గదిలోకి వెళ్ళ లేదుగా?"

"నిన్న రాత్రి పదకొండింటికే నేను నిద్రపోయాను. నా గది దాటి నేను బయటకు వెళ్ళలేదు.

వాలి కళ్ళు ఆమెవైపు తీక్షణంగా చూశాయి. అతని కుడిచేయి కోటుజేబులోకి వెళ్ళింది. మరో క్షణంలో అతను చెయ్యి చాచాడు. ఎర్ర మరకలున్న ఆకుపచ్చ షిఫాన్ చీరముక్క అతని అరచేతిలోంచి ఆమెవైపు ఆవులించింది!

"అమ్మాయ్, నిన్న రాత్రి నువ్వా గదిలోకి వెళ్ళక పోతే రక్తపుమరకలున్న ఈ చీరముక్క ఆ గదిలో ఎలా పడుంది?"

ఆమె మాట్లాడలేకపోయింది. హఠాత్తుగా బట్టల స్టాండుమీదున్న ఆకుపచ్చ షిఫాన్ చీరని పరిశీలించింది. అడుగు భాగంలో అది చిరిగినట్టుంది. ఉక్కిరి బిక్కిరి

అవుతూ, ఉషాదేవి వణుకుతూన్న పెదవులతో వాలి కెదురుగా వచ్చి నిలబడింది. మొహంలో నెత్తురుచుక్క లేనట్టుంది. అతని చేతిలోని చీర ముక్కని పదేపదే చూసింది.

"కథ యింతవరకూ వచ్చాక మీకు నిజం చెప్పడం మంచిదేమో" అంది.

వాలి ఆమె దగ్గరగా వెళ్ళాడు. తన రెండు చేతుల్నీ ఆమె భుజంపైవేసి, భయంతో వణుకుతూన్న ఆమె కళ్ళలోకి చూశాడు.

"అమ్మాయ్, నిజం చెప్పడం ఎల్లప్పుడూ మంచిదే."

ఉషాదేవి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమె మెల్లగా చెప్పసాగింది:

"నిన్న రాత్రి పదిగంటలనుంచి నిద్రరాక నా గదిలో పచార్లుచేస్తూ తిరిగాను. దక్షిణామూర్తిగారికి నామీద కోపం వచ్చిందనీ, నన్ను పంపివేయడానికి నిశ్చయించుకున్నారనీ ఇంతకుముందే తెలుసుకున్నాను. ఓసారి ఆయనతో మాట్లాడాలని నిశ్చయించాను. మేడమీద దక్షిణామూర్తిగారి గదిలో 12 వరకూ దుర్గమ్మగారి మాటలు వినపడ్డాయి. ఆమె వెళ్ళిపోవడంతోటే ఒంటరిగా ఆయనతో మాట్లాడవచ్చని అనుకున్నాను. ఇంతలో వీధి తలుపులు తోసిన చప్పుడయింది. కాస్సేపట్లో యెవరో మెట్లెక్కారు. దక్షిణామూర్తిగారి గదిలో శంకరం కంఠం వినపడింది. అతడు బయటకురాగానే దక్షిణామూర్తిగారితో మాట్లాడవచ్చని నేను మెట్ల మీదే నిలబడ్డాను. దక్షిణామూర్తిగారితో శంకరం ఏదో అంటున్నాడు. బాగా తాగడంవలన అతడి మాటలు అంత స్పష్టంగా లేవు. కాస్సేపట్లో అతడు గది

లోంచి బయటకు వచ్చాడు. "మావయ్యా, బాగా నిద్రపో!" అంటూ నడవ మధ్యనున్న మెట్లెక్కి రెండో అంతస్తులోని తన గదివైపు వెళ్ళిపోయాడు. తర్వాత నేను దక్షిణామూర్తిగారి గదిలోకి నడిచాను. ఆయన ముఖం టేబుల్ మీద ఆనివుంది. నిద్రపోతున్నట్లు ఆయన కనిపించారు. దగ్గరగా వెళ్ళాను. ఆయన తలమీద పెద్ద గాయాలు అగుపించాయి. టేబులుమీద రక్తం మరకలున్నాయి. పట్టుకొని ఆయన్ని లేవదీయబోయాను. ఆయన మరణించారని గ్రహించి భయపడ్డాను. అదే క్షణంలో రొటేటింగ్ కుర్చీ నా చెయ్యి తగిలి కదలడం వలన ఆయన తటాలున కుర్చీలోంచి తివాసీమీదకు జారి పడ్డాడు. ఆయన నోట్లో జేబురుమాలు కుక్కబడివుంది. భయంతో తొందరగా బయటకొచ్చి తిన్నగా నా గదికి పోయి పడుకున్నాను. దక్షిణామూర్తిగారి గదిలో వున్నప్పుడు ఏ కుర్చీకో నా చీర తగిలి ఖంగారులో చిరిగి వుంటుంది. ఆ చిరిగిన ముక్క మీకు దొరికి వుండవచ్చు."

"ఆయనతో ఏమిటి మాట్లాడదామని వెళ్ళావు?" ప్రశ్నించాడు వాలి.

"నేను మంచి కుటుంబానికి చెందిన స్త్రీని కాదని దక్షిణామూర్తిగారు పొరబడుతున్నారు. నిబ్బరాజు గారితో నేను రహస్యంగా తిరగడం ఆయన వినివుంటారు. నిబ్బరాజుగారిని నేను బుట్టులో వేయాలని ప్రయత్నిస్తున్నానని దక్షిణామూర్తిగారు అనుకున్నారు. ఆయనకి నామీద కోపం వచ్చింది. నా కుటుంబాన్ని గురించి నిజం చెబుదామని ఆయన గది కెళ్ళాను. నా తండ్రి కరాచీలో పెద్ద వ్యాపారం చేసి లక్షలు గడించారు. ఇంతలో పాకిస్తాన్ రావడంతోటే మా స్థితి తారుమారు

అయింది. దిక్కులేక కట్టుకున్న గుడ్డలతో అమ్మ, నాన్న, నేనూ భారతదేశం చేరుకున్నాం. ఇక్కడికొచ్చాక అమ్మ టైఫాయిడ్ జ్వరం వచ్చి మరణించింది. ఆమె పోయిన కొన్నివారాల్లో నా తండ్రి కూడా మరణించారు, నేను ఒక్కర్తెనే మాత్రం బ్రతికున్నాను. ధైర్యం తెచ్చుకున్నాను. పొట్టకోసం ఏదో ఉద్యోగం చెయ్యాలి. ఒక అనాధాశ్రమంలో చేరాను. దుర్గమ్మగారు అక్కడ నన్ను చూశారు. ఆమె తనతో వచ్చి తనింట్లో వుండమని నన్ను మరీమరీ అడిగారు. అలాగే ఇక్కడికి వచ్చాను. నేనిక్కడి కొచ్చిన మూడు నెలల తరవాత నిబ్బరాజుగారు హైద్రాబాద్ నుంచి వచ్చారు. మొదట్నుంచీ ఆయనకి నామీద ప్రేమ ఏర్పడింది. నన్ను పెళ్ళిచేసుకుంటా నన్నారు. ఈ విషయాలన్నీ చెబుదామని దక్షిణామూర్తి గారి గదిలోకెళ్ళాను, కాని నే వెళ్ళేటప్పటికే ఆయన పరలోకంలో ఉన్నారు."

వాలి సానుభూతితో ఆమె బుగ్గమీద వేళ్ళతో నిమిరాడు. ఆమె వీపుమీద అనురాగంతో తట్టాడు. మౌనంగా గుమ్మంవైపు నడిచాడు.

"నన్ను రక్షిస్తారుగా?"

ఆమె ప్రశ్న వెనుక నుంచి దీనంగా వినపడింది. వెను దిరిగి ఆమెవైపు జాలిగా చూశాడు.

"అమ్మాయ్ మానవులు ఊహించలేని శక్తి ఎల్లప్పుడూ నిర్దోషులను కాపాడుతూనే ఉంటుంది" అని వాలి గుమ్మందాటి బయటకు వెళ్ళిపోయాడు.

4

కింది భాగంలో ఉన్న లైబ్రరీ గది దగ్గరకు వెళ్ళాడు మూసివున్న తలుపులను తోసుకుని లోపలికి ప్రవేశించాడు.

కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదవటంలో నిమగ్నుడైన మకరమూర్తి తలుపుల చప్పుడు వినగానే ఉలిక్కిపడ్డాడు.

"మీరా!" అన్నాడు మకరమూర్తి వాలిని గురించి.

జవాబియ్యకుండా వాలి ముందుకు వెళ్ళాడు. ఓ కుర్చీమీద తన రెండు చేతులనూ ఆనించి, వంగి మకరమూర్తిని పరీక్షగా చూశాడు. అతని వయస్సు ఇరవై రెండేళ్ళుంటుంది. పొట్టిగా, బలహీనంగా వున్నాడు. పిరికివాడిలా వున్నాడు. ఇంత అమాయకంగా, బలహీనంగా వున్నతను ఈ హత్య చేసుంటాడా? వాలి ఆలోచించసాగాడు.

"అబ్బాయ్, నిన్న రాత్రి 11 గంటల తర్వాత నువ్వు ఏం చేశావ్?"

"సరిగ్గా పదకొండున్నర అవగానే దక్షిణామూర్తి గారి గదిలోకి దుర్గమ్మగారు వచ్చారు, వాళ్ళు ఏవో మాట్లాడుకుంటారని నేను సెలవుతీసుకొని, గదికి వెళ్ళి పడుకున్నాను."

"రాత్రి పన్నెండూ ఆ సమయంలో ఏ చప్పుడేనా విన్నావా?"

"నేను శవంలా పడుకుంటానండి. ఎంత చప్పుడు చేసినా నాకు వినపడదు."

"నిన్నరాత్రి నీకంటె ముందు నిబ్బరాజు దక్షిణామూర్తిగారితో మాట్లాడాడని విన్నాను. వాళ్ళు ఏం మాట్లాడారో తెలుసా?"

"తెలీదండి. కాని నేను గదిలో అడుగుపెట్టేసరికి దక్షిణామూర్తిగారు కోపంతో భోగిమంటలా మండుతున్నారు.

'ఈ విధవ ఎంతపనైనా చేస్తాడు! దుర్మార్గుడు!' అని గట్టిగా అన్నారు. ఆ మాటలు తమ్ముడ్ని గురించి అన్నవే అని నేను ఊహించాను. చివరికి తమ్ముడుమీద రేగిన కోపాన్ని నామీద కక్కేశారు. దుర్గమ్మగారు రావడంతోటే విముక్తి వచ్చిందనుకుంటూ, వెళ్ళి పోయాను."

"దక్షిణామూర్తిగారు నిన్ను బాగా చూసేవారా?"

"ఆ విషయాలు అడిగి నన్ను బాధపెట్టకండి. మా తండ్రిగారు పోయినప్పట్నించీ ఏదో అరణ్యవాసంలో ఉన్నట్టు ఇక్కడ కాలం గడుపుతున్నాను. ఇంకో మూడేళ్ళు పోతే నా ఆస్తి నాకు వస్తుందని ఆశిస్తూ, యెవరు ఏమన్నా నోరు మూసుకొని జీవిస్తున్నాను. దక్షిణామూర్తిగారు ముక్కోపి. ఆయన కళ్ళకి నేనేదో పురుగులా అవుపడేవాడిని. ఈ పదేళ్ళూ ఆయన నన్ను కాలికిందనున్న పురుగుని చూసినట్లు చూశారు."

డిటెక్టివ్ వాలి ఆలోచిస్తూ, గుమ్మందాటి బయటకు వెళ్ళాడు. అతని మెదడులో మకరమూర్తి అన్న ఆఖరి మాటలు గిర్రున తిరుగుతున్నాయి. కాలికింది పురుగు!

వాలి కిందనున్న హాలులో నిబ్బరాజుకి యెదురుగా కూర్చున్నాడు. కోటు జేబులోంచి ఒక చుట్ట తీసి, వెలిగించి, పొగ పీలుస్తూ ఇలా అడిగాడు.

"అబ్బాయ్, నిన్న రాత్రి నువ్వు ఎన్నింటికి పడుకున్నావ్?"

"రాత్రి 12-30 దాకా నిద్రపట్టలేదు."

"నీ గది యెక్కడుంది?"

"రెండో అంతస్తులో."

"శంకరం గది?"

నిబ్బరాజు విసుగ్గా ఓసారి వాలివైపు చూశాడు.

"రెండో అంతస్తులో ఒకే వరసలో మూడు గదు లున్నాయి. మధ్య గది నాది. ఎడమపక్క గది శంకరంది. కుడిపక్క గది మకరమూర్తిది."

"నిన్న రాత్రి నిద్రపట్టకపోతే ఏం చేశావు?"

నిబ్బరాజు కోపంగా లేచాడు.

"నీలాంటి పిచ్చి డిటెక్టివ్‌లని యింట్లోకి రానిస్తే, పాలోమని ప్రశ్నల వర్షాలు కురుస్తూనే వుంటాయి. ఇతరత్రా చేయవలసిన పనులు చాలా ఉన్నాయి నాకు!"

వాలి విచిత్రంగా నవ్వాడు. "నీ అన్నలాగే నీకు కూడా కోపం యెక్కువ. కాని మీ యిద్దరి హృదయాలు మంచివి. అది నాకు తెలుసు. నీ అన్న హంతకుడ్ని పట్టు కోవాలని ప్రయత్నిస్తున్నాను. ఈ విషయంలో సహాయ పడ్డం నీ ధర్మం కాదా!"

నిబ్బరాజు కింది పెదవిని కొరుక్కుంటూ, మళ్ళీ కుర్చీలో కూలబడ్డాడు.

"అయితే చెప్తా వినండి. రాత్రి పదకొండున్నర దాకా నేను గదిలోనే ఉన్నాను. నిద్రపట్టలేదు. అప్పుడు గదిలోని కుర్చీని బయట నడవలోకి లాక్కుని, ఆలోచిస్తూ దానిలో చాలాసేపు కూర్చుండిపోయాను."

"అప్పుడు మకరమూర్తి ఏం చేస్తున్నాడు?"

"వాడు పక్కగదిలో పడుకున్నాడు."

"పడుకున్నాడని నీకు బాగా తెలుసా?"

"వాడి గదికి తాళంలేదు. దాన్నిబట్టి పడుకున్నాడని అంటున్నాను. వాడు గదిలో లేకపోతే తలుపులకి తాళం వేస్తాడు. అది కాకుండా వాడు ప్రతిరోజూ

మామూలుగా పదిన్నరకే నిద్రపోతాడు."

"అయితే అతను ఈ హత్య చెయ్యలేదంటారా?"

"వాణ్ని అనుమానించినవాళ్ళు మూర్ఖులని నా నమ్మకం. ప్రాణం లేనట్టు వాడు ఈ ఇంట్లో జీవితాన్ని సాగిస్తున్నాడు. అన్నయ్య వాడిని యెప్పుడూ కాలికింద నొక్కిపెట్టి, భయపెట్టి పిరికిపందగా తయారుచేశాడు. మకరమూర్తి తండ్రి తన ఆస్తి అంతకీ అన్నయ్యని సర్వాధికారిగా నియమించడంలో పెద్ద పొరబాటు చేశాడు. ఆస్తి వాడికి ముట్టివుంటే మకరమూర్తి మరో విధంగా అభివృద్ధిలోకి వచ్చి, సంఘానికి ఉపయోగపడే వాడు."

"తన గదిలోంచి మకరమూర్తి కిందకు దిగివుంటే మీరు చూసేవారా?"

"తప్పకుండా చూసేవాడిని. నా గదిముందు నడవలో నేను కూర్చున్నాను. నా ఎడంపక్కనున్న శంకరం గది దగ్గరగా మేడమెట్లున్నాయి. మకరమూర్తి కిందకి వెళ్లాలంటే నా ముందరనుంచి వెళ్ళి ఆ మెట్లు దిగాలి. ఇంకో తోవలేదు."

"అతను దిగలేదు!"

"నేను పన్నెండూ పదివరకూ అలాగే కూర్చున్నాను. వాడు దిగలేదని నేను చెప్పగలను."

"శంకరం పన్నెండింటికి కింద తలుపులు తోసిన చప్పుడు నీకు వినపడిందా?"

"వినపడింది. కాని కింద తలుపులు చప్పుడయిన అయిదు నిమిషాలదాకా వాడు పైకి రాలేదు."

"అయిదు నిమిషాల్లో శంకరం దక్షిణామూర్తిని సులువుగా చంపొచ్చు. నీ సాక్ష్యాన్నిబట్టి హత్యానేరం

శంకరంమీదకే వెళ్ళింది."

"నేను మొదటే చెప్పేగా మీతో. ఏదో కోపం వచ్చి వాడే చంపివుంటాడు."

"శంకరం పైకి రాగానే నువ్వు పలకరించావా?"

"పలకరించాను. వాడు అదోవిధంగా వున్నాడు. నాతో మాట్లాడకుండా, జంకుతూ తన గదిలోకి వెళ్ళి, తలుపులు మూసుకున్నాడు. మరో అయిదు నిమిషాలు అయాక నేను కూడా నా గదిలోకి వెళ్ళి నిద్రపోయాను."

డిటెక్టివ్ వాలి కళ్ళుమూసుకొని, చుట్టపొగ దట్టంగా పీల్చి వదులుతూ ఆలోచించసాగాడు. హఠాత్తుగా సోఫాలోంచి లేచి మేడమెట్లు ఎక్కాడు.

హత్య జరిగిన గదిలోకి వాలి మళ్ళా ప్రవేశించాడు. ఆ గదిలో వేళ్ళాడుతున్న ఒకో సిల్కు తెరను దుర్గమ్మ పరకాయించి చూస్తోంది. వాలి ఆమె దగ్గరగా వెళ్ళాడు.

"అమ్మాయి, ఏమిటంత దీక్షగా చూస్తున్నావు" అడిగాడతను.

సిల్కు తెర వెనక మేడమెట్లున్నాయి.

"ఆ తెరను చూస్తూంటే నాకు ఏదో జ్ఞాపకం వస్తోంది. ఏమిటో చెప్పలేకుండా ఉన్నాను" అందామె.

వాలి క్షణకాలం ఆలోచించాడు.

"నిన్న రాత్రి నీ భర్తతో మాట్లాడి వెళ్ళిపోయే టప్పుడు ఆ తెరవైపు చూశావా?"

"చూశాను. జ్ఞాపకం వచ్చింది. ఆ తెర వెనక ఏదో నల్లగా అగుపించింది, ఏదో ఆకారం!" అందామె.

డిటెక్టివ్ వాలి అమాంతంగా తెరను పక్కకుతోసి మెట్లవైపు వెళ్ళాడు. మేడ మెట్ల ప్రాంతంలో వంగి, పరీక్షగా దేనికోసమో చూడసాగాడు. కాస్సేపట్లో

వేళ్ళతో ఏదో వస్తువును పట్టుకొని "దొరికింది! దొరికింది" అని అరుస్తూ ఆమె వైపు కదిలాడతను.

దొరికిన వస్తువును తన జేబు రుమాల్తో చుట్టి కొసలు ముడేశాడతను.

దుర్గమ్మ అతడివైపు ఆశ్చర్యంతో చూసింది. ఏదో అడగబోయింది.

"అమ్మాయ్, కిందకు వెళ్దాం పద" అంటూ వాలి గబగబా మెట్లవైపు వెళ్ళిపోయాడు.

కిందనున్న హాలులో వాలి కూర్చున్నాడు. తన జేబు రుమాలుతో కట్టిన మూటను అతను జాగ్రత్తగా టీపాయ్ మీద ఉంచాడు. దుర్గమ్మ, నిబ్బరాజు, ఉషాదేవి, మకరమూర్తి, వంటవాడు రంగన్న — అందరూ టీపాయ్ మీదున్న మూటని విస్మయంతో చూస్తున్నారు. మరో క్షణంలో వాలి గంభీర కంఠం గదిలో ప్రతిధ్వనించింది.

"హత్య జరిగిన గదిలో, తెర వెనుక మేడ మెట్లమీద హత్యే చేసిన వ్యక్తి పొరపాటున వదిలేసిన వస్తువు దొరికింది. మీ దగ్గర ఏదేనా పెట్టెవుంటే ఇయ్యండి."

అందరూ ఆశ్చర్యపోతూ కదలకుండా వుండిపోయారు. రంగన్న మాత్రం వంట యింట్లోకి వెళ్ళి, చిన్న కర్ర పెట్టె పట్టుకొచ్చి వాలికిచ్చాడు. వాలి జేబు రుమాలు మూటను జాగ్రత్తగా ఆ పెట్టెలో పెట్టాడు. పై మూత బిగించాడు. ఆ పెట్టెను పట్టుకొని, "రంగన్నా! యిలా రా" అంటూ వాలి వారందరూ కూర్చున్న స్థలంనుంచి దూరంగా వెళ్ళాడు. రంగన్న వాలిని అనుసరించాడు. వాలి ఏదో రంగన్నకి రహస్యంగా చెవులో చెప్పాడు. తన జేబులోంచి ఇరవై రూపాయలుతీసి అతనికిచ్చాడు. రంగన్న సంతోషంగా పెట్టెను అందుకున్నాడు. వాలి

మళ్ళా వాళ్ళందరూ కూర్చున్నచోటుకి వెళ్ళాడు.

"దుర్గమ్మగారూ! నేను మీ ఇంటికి వచ్చిన పని పూర్తయింది. నాకు దొరికిన వస్తువు మూలంగా హంతకు లెవరో అరటిపండు వలిచినట్టు తెలిసిపోయింది. ఆ పెట్టెను జాగ్రత్తగా వుంచమని రంగన్న కిచ్చాను. నేను బయటకు వెళ్తున్నాను. రాత్రి ఎనిమిదింటికి మళ్ళా వస్తాను. ఆ సమయానికి మీరంతా మేడమీద హత్య జరిగిన గదిలో సమావేశమవండి. అప్పుడు మీకు నిజం తెలియజేస్తాను."

వాలి చకచకా గుమ్మందాటి బయటకు వెళ్ళిపోయాడు. హాల్లో కూర్చున్నవారందరూ ఒకరొన్నొకరు అనుమానంగా చూసుకున్నారు.

5

హత్య జరిగిన గదిలోని ఎలక్ట్రిక్ దీపాలన్నీ ప్రకాశ వంతంగా వెలుగుతున్నాయి. గోడగడియారం ఎనిమిది కొట్టింది. ఒక గుండ్రటి టేబుల్ చుట్టూ వాళ్ళందరూ గుమిగూడారు. పొద్దుట అరెస్టు చేయబడ్డ శంకరం, ఇన్ స్పెక్టర్ రాజయ్యతో సహా వచ్చాడు. వంటవాడు రంగన్న గోడకి బోర్లాపడి నిల్చున్నాడు.

ఆజానుబాహుడైన డిటెక్టివ్ వాలి తన కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు. ఓసారి గర్వంగా తన బుగ్గమీసాల్ను సరిదిద్దుకున్నాడు. చుట్టపొగ పీల్చి వదులుతూ టేబులు చుట్టూ కూర్చున్న వాళ్ళందర్నీ కలయజూశా డతను.

"నిన్న రాత్రి యీ గదిలో దక్షిణామూర్తి హత్య చేయబడ్డాడు. రాత్రీ పగలూ పనిచేస్తూ ఈ ఇంటికి యిద్దరు గూర్ఖాలు ఉన్నారు. నిన్న రాత్రి బయట వాళ్ళెవరూ లోపలకు రాలేదని తేలింది. అందువలన

ఇంట్లో ఉన్న వాళ్ళే యీ హత్య చేసివుండాలి. అయితే హత్య చేసిన వ్యక్తి ఎవరు?" అన్నాడు వాలి గంభీరంగా.

వాలి చూపును దుర్గమ్మవైపు పోనిచ్చాడు. "డాక్టర్ రిపోర్టునుబట్టి దక్షిణామూర్తి 12—12-0 మధ్య మరణించి వుండాలని తెలుస్తోంది. హత్యకు ఉపయోగించిన ఆయుధం పొడుగాటి, లావుగా వున్న కర్ర. ఆ కర్ర ఆ గదిలో వున్నదే. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్నిబట్టి ఆలోచిస్తే యీ హత్య ఆపుకోలేని ఉద్రేకంతో, కసితో జరిగివుండాలని తెలుస్తోంది. నిన్న రాత్రి పన్నెండుదాకా దుర్గమ్మ భర్తతో మాట్లాడుతూ యీ గదిలోనే వుంది. ఇద్దరూ పోట్లాడుకున్నారు, తిట్టుకున్నారు. బతికున్న దక్షిణామూర్తిని ఆఖరసారిగా చూసినది ఆమే!"

దుర్గమ్మ గాభరాగా కుర్చీలోంచి లేచి కోపంగా వాలివైపు చూసింది.

"అయితే, నేనే ఆయన్ని చంపానా?"

"నువ్వు చంపావని నేననలేదు. నీకంటె ఎక్కువగా నీ భర్తతో పోట్లాడిన మరొక వ్యక్తి యిక్కడున్నాడు. అతడు యెంత నీచమైన పనైనా చేస్తాడని దక్షిణామూర్తి అంటే మకరమూర్తి కూడా విన్నాడు. నిబ్బరాజు ముక్కోపి!"

నిబ్బరాజు కుర్చీలోంచి లేచి కోపంగా వాలివైపు వెళ్ళబోయాడు. కాని పక్కనే కూర్చున్న ఇన్‌స్పెక్టర్ రాజయ్య అతడిని బలంగా పట్టుకొని మళ్ళీ కుర్చీలో కూర్చోబెట్టాడు.

"ఇదంతా మోసం! ఈ డిటెక్టివ్‌ని బయటకు

నట్టెయ్యాలి!" అర్చాడు నిబ్బరాజు.

నవ్వుతూ వాలి అతడివైపు చూశాడు.

"హైదాబాద్‌లో యింతకుముందు నువ్వు చంపిన వ్యక్తి విషయం మర్చిపోతున్నావు!" అన్నాడు వాలి.

నిబ్బరాజు మొహం వాలేశాడు.

"హైదాబాద్‌లో ఇంతకుముందు ఒకడిని పిస్టల్‌తో కాల్చి చంపాను. నిజమే. కాని ఆ హత్య చేసినందుకు నన్నెవరూ ఖండించలేదు. అందరూ నన్ను పొగిడారు. నేను చంపిన వ్యక్తి, ఒక నటోరియస్ రేపిస్టు! అనేక మంది నిస్సహాయులైన యువతులను అతడు బలాత్కరించాడు. జంట నగరాల్లో అతడంటే విపరీతమైన భయం ప్రజల్లో ఏర్పడింది. అతడు ఎక్కడైనా కనబడితే పట్టుకోమనీ, పట్టుకోలేకపోతే కాల్చి చంపమని పోలీసులు ప్రచారం చేశారు. ఒక రాత్రి కొంచెం దూరంనుంచి ఎవరో యువతి కేకలు నాకు వినపడ్డాయి. నేను పరుగెత్తుకు వెళ్ళాను. ఆమెను వదిలి అతడు పారిపోయాడు. అప్పుడు అతడివైపు షూట్ చేశాను. అతను కాస్సేపట్లో మరణించాడు. అతడి చావుతో శని విరగడైంది. పోలీసులు కూడా నన్ను మెచ్చుకున్నారు. ఇదీ నిజం. అన్నయ్య హత్యతో నాకు సంబంధంలేదు" అన్నాడు నిబ్బరాజు.

అతడివైపు చూశాడు వాలి.

"నువ్వే హత్య చేశావని నేననలేదుగా! నీలా కోపంగా అర్చేవాళ్ళు యీ హత్య చేసుండరు. మొరిగే కుక్కలు సాధారణంగా కరవవు. ఈ హత్య చాలా తెలివిగా చేయబడింది. కాలికింది పురుగులా తిన్ని దక్షిణామూర్తి చూసేవాడని మకరమూర్తి నాతో అన్నాడు. ఆ మాటలు హత్యారహస్యాన్ని భేదించాయి. కాలికింది

పురుగు యెప్పుడో ఒకప్పుడు కదులుతుంది. సర్కస్‌లోని సింహం ఒక్కోసారి గరిన్యూజ్ మీదకు దూకుతుంది.

పదేళ్ళపాటు మకరమూర్తి యీ ఇంట్లో పురుగులా జీవించాడు. చూసేవాళ్ళకు అతడు అమాయకుడిలా, నిస్సహాయుడిలా కనిపిస్తాడు. కాని అతడిలో కోపం, పౌరుషం లేకపోలేదు. సముద్రపు లోతులు అతడిలో యిమిడివున్నాయి. మకరమూర్తి మంచుకప్పిన అగ్ని పర్వతంలాంటివాడు. పదేళ్ళపాటు అన్నీ సహించాడు. నిన్న రాత్రి దక్షిణామూర్తి తిట్లతో అతడిలోని ఓర్పుకానే శక్తి మాయమై మరో రూపం దాల్చింది. సంవత్సరాల తరబడి తనలో అంతర్గతంగా అణచివేయ బడిన ఉద్రేకం ఒక్కసారి అగ్నిపర్వతంలా పగిలి లావాలా పొంగుతూ ప్రవహించసాగింది. ఆ స్థితిలో గదిలో వున్న ఆ లావుపాటి కర్రసుత్తి, నోట్లో రుమాలు కుక్కి మకరమూర్తి అమాంతంగా...."

మకరమూర్తి భయంతో వణుకుతున్నాడు.

"నేను లోకువని నేరాన్ని నామీదకే తోస్తున్నారా? నేను యీ గదిలోకి మళ్ళా రాలేదు. నా గదిలో నిద్ర పోతున్నాను" అన్నాడతను.

"నీ గదికి తాళం వేయకపోవడంవలన 11-30 కల్లా నువ్వు నిద్రపోతున్నావని నిబ్బరాజు పొరబడ్డాడు. దుర్గమ్మ 11-30కి గదిలోకి రాగానే నిద్రపోతానని చెప్తూ నువ్వు వెళ్ళిపోయానన్నావు. కాని నువ్వు గదిదాటి బయటకు పోలేదు. గది మూలనున్న మేడమెట్లు దగ్గర, సిల్క్ కర్టన్ వెనుక దాక్కున్నావు. కర్టన్ వెనుక నల్లగా ఏదో ఆకారం కనబడిందని దుర్గమ్మ కూడా చెప్పింది. మాటల ధోరణిలో వాళ్ళిద్దరు నువ్వు వెళ్లావో

లేదో గుర్తించలేకపోయారు. దుర్గమ్మ వెళ్ళిపోయాక నువ్వు దక్షిణామూర్తిని హతమారిస్తే దుర్గమ్మ సాక్ష్యం నిన్ను కాపాడుతుందని గ్రహించావు. మంచి అవకాశం నీకు చిక్కింది.

"సరిగ్గా పన్నెండింటికి దుర్గమ్మ వెళ్ళిపోయింది. దక్షిణామూర్తి ఏ కాగితాలో చూస్తున్నాడు. నీవు అలవాటైన పిల్లి నడకతో మెల్లిగా కర్టెన్ వెనుకనుంచి బయటకొచ్చి అతడి నోట్లో రుమాలు కుక్కి ఆ కర్రతో అతడి తలను పగులగొట్టి చంపావు. హెడ్ యింజరీస్ మూలంగా అతడు మరణించాడు. తర్వాత బయటకు పోవాలనుకున్నావు. కాని అదే సమయంలో ఎవరో ఆ గదివైపు వస్తూన్న చప్పుడు నీకు వినబడింది. వెనక్కి వెళ్ళి అదే తెర వెనుక దాక్కున్నావు. శంకరం తప్ప తాగి గదిలోకి వచ్చాడు. దూరంగా నిలబడి శంకరం తన మావవైపు చూశాడు. దక్షిణామూర్తి టేబులుమీద తలను ఆనించి పడుకున్నట్లు శంకరానికి కనిపించివుండాలి. అందుకే 'బాగా నిద్రపో మావయ్యా!' అంటూ అతడు బయటకు వెళ్ళిపోయాడు."

వాలి మళ్ళా మకరమూర్తి వైపు చూశాడు.

"బయటకు పోవడానికి మళ్ళా నువ్వు ప్రయత్నించావు. మళ్ళా ఎవరో గదిలోకొస్తున్న చప్పుడు విని కర్టెన్ వెనుక దాక్కున్నావు. ఈసారి ఉషాదేవి గదిలోకొచ్చింది. ఆమె టేబుల్ దగ్గరకెళ్ళింది. దక్షిణామూర్తి హత్య చెయ్యబడ్డాడని తెలుసుకుంది. ఆమె చెయ్యితగిలి రొటేటింగ్ కుర్చీ కదిలింది. శవం తివాసీమీదకు జారి పడింది. అందుకే టేబులుమీదా, తివాసీమీద రక్తం మరకలు ఉన్నాయి. భయంతో ఆమె వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళాక మెల్లిగా నువ్వు నీ గదికి చేరుకున్నావు!"

మకరమూర్తి నిస్సహాయంగా వాలివైపు చూశాడు.

"నేనే యీ హత్య చేశానని మీరంటే అనొచ్చు. కాని రుజువు లుండాలిగా!"

డిటెక్టివ్ వాలి గంభీరంగా నవ్వాడు.

"రంగన్నా!" పిల్చాడు వాలి.

గోడవారగా నిలబడిన రంగన్న వాలి దగ్గరగా వచ్చాడు.

"నీకు నేనిచ్చిన పెట్టె గురించి, నువ్వు చూసినదంతా వివరంగా చెప్పు" అన్నాడు వాలి.

అందరూ రంగన్నవైపు చూశారు. అతడు వినయంగా చేతులు నులుపుకున్నాడు.

"వాలిగారు ఇచ్చిన పెట్టెను వంట గదిలోని బీరువామీద పెట్టి కాపలా కాస్తూ కూర్చున్నాను. సాయంత్రం ఐదింటికి కింద ఎవ్వరూ లేరు. మకరమూర్తి వంట గదిలోకి వచ్చారు. కడుపు నొప్పిగా ఉందని, పక్కనున్న షాపు కెళ్ళి ఒక సోడా పట్రమ్మని నాకు డబ్బిచ్చారు. అలాగే అని డబ్బు తీసుకొని, సోడాకోసం వెళ్ళినట్టు నటించాను. వాలిగారి అజ్ఞ ప్రకారం ఒక సోఫా వెనుక వొంగి కూర్చుని, మకరమూర్తిగారు వంటింట్లో ఏమిచేస్తున్నదీ గమనించాను. ఆయన అటూ యిటూ తొంగిచూసి బీరువామీదున్న ఆ పెట్టెను తెరిచారు. అందులో వున్న జేబు రుమాలు మూటవిప్పి, లోపల ఉన్న వస్తువుని చూసి, మళ్ళా ఎప్పట్లా మూటగట్టి పెట్లో పెట్టేశారు. ఆ క్షణంలో నేను మెల్లిగా బయటకు జారాను. కాస్సేపట్లో సోడాబుడ్డి తెచ్చి ఆయనకు ఇచ్చాను."

వాలి మళ్ళా యిలా చెప్పసాగాడు:

"మకరమూర్తీ! నీ నేరాన్ని నువ్వే రుజువుచేసుకున్నావు. ప్రతీ నేరస్తుడూ హత్యాస్థలంలో తనేదేనా వదిలేశానేమో అని గాభరాపడుతూనే వుంటాడు. నువ్వు దాక్కున్న స్థలంలో, తెర వెనక మేడమెట్లమీద నువ్వు పారేసిందేదో నాకు దొరికుండాలని భయపడ్డావు. అదేమిటో కనుక్కోవాలనే ఆత్రుత — మరెవ్వరికీ లేని ఆత్రుత హాంతకుడవడం వలన నీకు అధికంగా వుంది. భయంతో పెట్టెని తెరిచి, నాకు దొరికిన రహస్యపు వస్తువుని కళ్ళారా చూశావు. అంత జాగ్రత్తగా మీ అందరి ముందూ జేబు రుమాలుతో మూటగట్టి, పెట్టెలో పెట్టిన అమూల్యరత్నం నేను చుట్ట కాల్చుకుని పారేసిన అగ్గిపుల్లని ఆలస్యంగా తెలుసుకున్నావు!"

మకరమూర్తి ఊపిరి బరువుగా పీలుస్తూ, తలని చేతులమీద వాలేశాడు. డిటెక్టివ్ వాలి బుగ్గమీసాలను సరుద్దుకుంటూ, రంగన్నతో నవ్వుతూ అన్నాడు:

, "రంగన్నా! జేబురుమాలు విప్పి, అమూల్యమైన ఆ అగ్గిపుల్లను వీరందరికీ చూపించు. తరువాత మ్యూజియంకి పంపుదాం."

—:ఐపోయింది:—